సాక్షి
జనగామ
శనివారం | 28 | జూన్ | 2025



దత్తత గ్రామంలో సంబురాలు
గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకున్న ఎస్ఎస్ తాడ్వాయి మండలం కొండపర్తిలో గ్రామస్తులు శుక్రవారం సంతోషంగా సంబురాలు చేసుకున్నారు. - 8లో▸




ప్రజల గుండెల్లోనే పీవీ..
చిన్న గ్రామం నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన గొప్ప మేధావి పీవీ నర్సింహారావు. నేడు పీవీ 104వ జయంతి సందర్భంగా కథనం. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36⁰/25⁰

వాతావరణం
ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరుడికి విశేష అలంకరణ



చిల్పూరు: భూనీల సమేత శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి శుక్రవారం భక్తులకు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామివారికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్తలు గోలి రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్ డైరీ ఆవిష్కరణ



జఫర్‌గఢ్: మండల పరిధి తిడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం రూపొందించిన స్టూడెంట్ డైరీని కలెక్టర్ రిజ్వాన్ బాషా శుక్రవారం తన కార్యాలయంలో డీఈఓ భోజన్నతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి డైరీ ఎంతగానో దోహదపడుతుందని, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో డైరీని రూపొందించడం అభినందనీయమని అన్నారు. డీఈఓ భోజన్న మాట్లాడుతూ పిల్లల విద్యా ప్రగతిని తల్లిదండ్రులు తెలుసుకోవడంతో పాటు విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటించేందుకు డైరీ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీఆర్టీ జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డి, హెచ్‌ఎం సదానందం, ఉపాధ్యాయులు నవీన్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



దేవరుప్పుల : పేదరిక నిర్మూలనతోపాటు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రూపాదేవి సూచించారు. శుక్రవారం లకావత్‌తండా(ఎం)లో మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించిన 'పీఎం ధర్తీ అభజన్ భగీధారి అభయాన్' ప్రత్యేక గ్రామసభలో ఆమె మాట్లాడారు. కిసాన్ క్రెడిట్ కార్డ్, ఆయుష్మాన్ భారత్, వృద్ధాప్య పింఛన్లు, ఇన్సూరెన్స్ స్కీమ్స్, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ సురేష్‌కుమార్, మండల వైద్యాధికారి రవితేజ, ఏఈఓ సనా మహావీన్, గ్రామ ప్రత్యేక అధికారి పి.మహేష్ పాల్గొన్నారు.

నాటి 'ఎమర్జెన్సీ' రోజులు గుర్తుకొస్తున్నాయి..



జనగామ రూరల్: ఇందిరాగాంధీ పాలనలో అమలు చేసిన ఎమర్జెన్సీ.. నాటి చీకటి రోజులు గుర్తుకొస్తున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం భారతీయ జనతా యువమోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యాన పట్టణంలోని నెహ్రూ పార్కు వద్ద నిర్వహించిన 'సంవిధాన్ హత్య దివస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1975లో నాటి కాంగ్రెస్ ప్రధాని ఇందిరాగాంధీ సొంత ప్రయోజనాల కోసం అంతర్గత కలహాలు అనే ఒక కుంటిసాకు చూపి ఎమర్జెన్సీ విధించి భారత పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయడంతో పాటు పత్రికా స్వేచ్ఛను హరించి నిరంకుశ పాలన కొనసాగించిందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ, జయప్రకాశ్ నారాయణ జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి అధికార కాంక్ష తప్ప ప్రజలపై చిత్తశుద్ధి ఏనాడూ లేదని, ఇప్పటికీ అదే ధోరణితో ప్రజల పట్ల వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజు, ఉపాధ్యక్షులు దేవరాయ ఎల్లయ్య, డాక్టర్ భిక్షపతి, మహిపాల్, నవీన్, దడిగా రవి, ఉల్లెంగుల రాజు, కీర్తి వెంకటేష్, రఫ్తార్ సింగ్, అవినాష్, రంజిత్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నకు పొదుపు భరోసా..

జిల్లాలో 2,824 మందికి లబ్ధి
- స్కీం కాలపరిమితి 24 నెలలు
- వీవర్ వాటా రూ.1,200
- అనుబంధ కార్మికుడికి రూ.800
- వాటాధనం చెల్లింపునకు మూడు నెలల వెసులుబాటు



నేత కార్మికుడి ఇంటిలో తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)

జనగామ: చేనేత రంగానికి ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు గత సర్కారు అమలు చేసిన త్రిఫ్ట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 'నేతన్న పొదుపు' పథకంగా ముందుకు తెచ్చింది. 36 నెలల కాల పరిమితిని ప్రస్తుత ప్రభుత్వం 24 నెలలకు కుదించింది. నేత, అనుబంధ కార్మికులు చెల్లించే వాటాధనంలో సర్కారు రెండింతలు కలిపి జమచేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోంది. పథకం ద్వారా నేతన్న కుటుంబాల్లో పొదుపు అలవాటును ప్రోత్సహించడం సర్కారు ముఖ్యఉద్దేశం.

జిల్లాలో 2,824 మంది కార్మికులు

నేతన్న పొదుపు స్కీం ద్వారా జిల్లాలో 2,824 మంది నేత, అనుబంధ కార్మికులకు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో 15వేల జియోట్యాగ్ మగ్గాలు, పవర్ లూమ్స్(మర మగ్గాలు) ఉన్నాయి. నేతన్న పొదుపు పథకానికి గతంలోనే కార్మికుల నుంచి సుమారు 3వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. చేనేత జౌళి శాఖ ప్రత్యేక అధికారుల బృందం అర్హత నిర్ధారణ కోసం ప్రతీ ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత థర్డ్ పార్టీ సర్వే చేపట్టారు. ఇందులో తప్పిన కార్మికుల వివరాలను జిల్లా అధికారులు నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపించారు. ఇదిలా ఉండగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో నేత కార్మికులు నేతన్న పొదుపు పథకానికి దూరంగా ఉన్నారు. అధికారులు తనిఖీకి వెళ్లిన సమయంలో సుదూర ప్రాంతాలకు వెళ్లడం, శుభకార్యాల నేపథ్యంలో మగ్గాలు విప్పి అటెక్కించడంతో ప్రస్తుతం నేత వృత్తి చేయడం లేదని రికార్డులో ఎక్కించారు. తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ నేతన్న పొదుపులో అవకాశం కల్పించాలని కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జిల్లాలో నేతన్న పొదుపు లబ్ధిదారుల వివరాలు

మండలం	నేత కార్మికులు	స్కీం అర్హులు	మొత్తం
జనగామ	683	683	1,366
బచ్చన్నపేట	359	330	689
నర్మెట	23	22	45
తరిగొప్పుల	17	15	32
స్టే.ఘన్‌పూర్	11	11	22
చిల్పూరు	01	01	02
జాఫర్‌గడ్	01	01	02
లిం.ఘనపురం	190	178	368
ర.నాథపల్లి	32	26	58
పాలకుర్తి	08	07	15
కొడకండ్ల	03	03	06
దేవరుప్పుల	137	82	219
మొత్తం	1,465	1,359	2,824

పథకం అమలు ఇలా..

నేత, అనుబంధ కార్మికులు ప్రతి నెలా తమ వేతనం నుంచి 8 శాతం కాంట్రిబ్యూషన్ చేస్తారు. ప్రభుత్వం కార్మికుల పొదుపునకు రెండింతలు(16శాతం) కలుపుకుని 24 నెలల తర్వాత వారి ఖాతాలో జమ చేస్తుంది. నేత కార్మికులు గరిష్టంగా రూ.1,200, అనుబంధ కార్మికులు రూ.800 వాటా ధనం చెల్లిస్తారు. మరమగ్గాల కార్మికులు 8 శాతం పొదుపు చేసుకోగా, ప్రభుత్వం అంతే మొత్తంలో భరోసా కల్పిస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 36 నెలల కాలపరిమితితో త్రిఫ్ట్ పథకం అమలు చేయగా, సీఎం రేవంత్‌రెడ్డి దీనిని 24 నెలలకు కుదించి నేతన్న పొదుపు పథకంగా మార్చారు. నెలనెలా పొదుపు చేసుకునే సమయంలో ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఆలస్యం జరిగితే.. నేత కార్మికులకు మూడు నెలల వెసులుబాటు కల్పించారు. అప్పటికీ పొదుపు జమ చేసుకోని పరిస్థితుల్లో సదరు కార్మికులు ఆ పథకం జాబితా నుంచి ఆటో మేటిక్‌గా తొలగిపోతారు.

పొదుపు పథకం బాగుంది



చేనేత వృత్తి నిరాధరణకు గురవుతున్న సమయంలో నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న నేతన్న పొదుపు పథకం కింద రెట్టింపు బోనస్ కలిపి ఇవ్వడంతో ఆర్థికంగా బలపడుతున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ నెలకు రూ.1,200 చెల్లిస్తే మరో రూ.2,400 కలిపి మూడేళ్లకు గాను రూ.1,29,600 రెండుసార్లు తీసుకున్నాను. నాతో పాటు భార్య కూడా నెలకు రూ.600 చెల్లిస్తే, ప్రభుత్వం రూ.1,200 బోనస్‌తో మూడేళ్లకు రూ.64,800 ఇచ్చింది. గత ప్రభుత్వం మూడేళ్లకు బోనస్ ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కీంను రెండేళ్లకు కుదించడంతో కార్మికులకు త్వరగా లబ్ధి చేకూరుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ మగ్గం నేసే కార్మికులకు చేయూత కొనసాగించడం అసరాగా నిలుస్తుంది.

- చింతకింది సోమయ్య, చేనేత కార్మికుడు, కోలుకొండ(దేవరుప్పుల)

ఎనిమిదేళ్ల నుంచి మగ్గం నేస్తున్నా..



ఎనిమిదేళ్ల నుంచి మగ్గం నేస్తున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న పొదుపులో ప్రతి నెలా రూ.1,200 చొప్పున పొదుపు చేసుకుంటున్నాను. 24 నెలల తర్వాత ప్రభుత్వం రెట్టింపు సొమ్ము అందిస్తుంది. గత ప్రభుత్వ హాయంలో త్రిఫ్ట్ పథకం ద్వారా రూ.1.36 లక్షలు వచ్చాయి. 8 నెలల సుదీర్ఘ కాలం తర్వాత ఈ పథరం పునఃప్రారంభం కావడం సంతోషంగా ఉంది.

- బిర్రు నరేష్, నేత కార్మికుడు, ఎల్లంల(జనగామ)

నోటరీ మ్యుటేషన్లపై ఆరా..!

- రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఏం జరుగుతోంది..?
- పట్టణ ప్రణాళిక సేవలపై వివరాల సేకరణ
- శాఖల వారీగా రెండున్నర గంటల పాటు సమీక్షించిన అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



మున్సిపాలిటీలో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

జనగామ: జనగామ మున్సిపల్‌లో జరిగిన మ్యుటేషన్ల సవరణ, సెటిల్ మెంట్లపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అదనపు కలెక్టర్(ఏసీ) పింకేష్‌కుమార్ ఆరా తీశారు. 'సెటిల్‌మెంట్ కింగ్ ఎవరు', 'సెటిల్‌మెంట్‌పై ఇంటలిజెన్స్ ఆరా' శీర్షికన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన వరుస కథనాలకు స్పందించిన అదనపు కలెక్టర్ శుక్రవారం మున్సిపాలిటీని ఆకస్మికంగా సందర్శించడంతో ఉద్యోగులు అప్రమత్తమయ్యారు. కమిషనర్ చాంబర్‌లో రెండున్నర గంటల పాటు రెవెన్యూ, అకౌంట్స్, పట్టణ ప్రణాళిక, శానిటేషన్, ఇంజనీరింగ్ తదితర విభాగాల వారీగా సమీక్షించారు. ఇటీవల మ్యుటేషన్ల సవరణకు సంబంధించి 22 మంది జాబితాను జతపరుస్తూ సీడీఎంఏ కమిషనర్ వెంకటేశ్వర్లుకు మెమో జారీ చేసిన సంగతి తెలిసిందే. గడిచిన ఆరు నెలల కాలంలో నోటరీ, నిర్మాణాల రెగ్యులరైజేషన్, మ్యుటేషన్ల సవరణపై సమగ్ర సమాచారంతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇక నుంచి నోటరీపై ఉన్న వాటిని రెగ్యులరైజ్ చేయరాదని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గతంలో చేసిన మ్యుటేషన్ల సవరణపై కూపీ లాగడంతో పాటు సదరు ఉద్యోగులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో మరింత వేగం పెంచాలని చెప్పారు. ముఖ్యంగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్ పనితీరు, వ్యవహారంపై ఎక్కువ సమయం కేటాయించినట్లు సమాచారం. సమీక్షలో మేనేజర్ రాములు, ఆయా శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుపదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జనగామ రూరల్: మత్తుపదార్థాల విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. 'డీఏడబ్ల్యూఎన్, డ్రగ్ అవేర్నెస్ అండ్ వెల్నెస్ నావిగేషన్ ఫర్ ఏ డ్రగ్-ఫ్రీ ఇండియా స్కీం – 2025'పై ఓబుల్‌కేశవపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ అమ్మేవారు స్కూల్ విద్యార్థులను టార్గెట్ చేస్తున్నారని, జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌తో కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్, జితేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలో డ్రై డే



తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వందరోజుల ప్రణాళికలో భాగంగా జనగామ పట్టణంలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన ఆయా వార్డుల పరిధిలో తడి, పొడిచెత్త ఎలా వేరు చేయాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే బతుకమ్మకుంటలోని చెట్ల పొదలను తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపయ్య, పులి శేఖర్, వార్డు ఆఫీసర్లు, మెప్మా స్టాఫ్ వాణిశ్రీ, తిరుమల, షాహిన్ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా

పాలకుర్తి టౌన్: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం.. ఇందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల, డీఆర్డీఓ వసంత, ఎంపీడీఓ రాములు, కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, కమ్మగాని నాగన్న, ఎండీ.నజీర్, యాకూబ్, పుల్లి గణేష్, బైరు భార్గవ్, పన్నీరు వెంకన్న, కమ్మగాని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మకంచలో పట్టపగలే చోరీ

- 12 తులాల బంగారు, 60 తులాల వెండి ఆభరణాల అపహరణ
- రూ.60వేల నగదు కూడా..



బీరువాను పగుల గొట్టిన దుండగులు



బాధితురాలు రేణుక

జనగామ: జిల్లా కేంద్రం ధర్మకంచ ప్రధాన రహదారిలో పట్టపగలే భారీ చోరీ సంఘటన శుక్రవారం జరిగింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మకంచకు చెందిన అంగన్‌వాడీ టీచర్ మంగోలు రేణుక ఉదయం 9.30 గంటలకు సెంటర్‌కు వెళ్లి.. రాత్రి 7 గంటలకు తిరిగి ఇంటికి చేరుకుంది. ముఖద్వారం తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువాలు పగుల గొట్టి ఉండడంతో వెంటనే 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకుని క్లూస్ టీంలను రప్పించారు. సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు, 60 తులాల వెండి వస్తువులు(కాళ్ల కడియాలు, పట్టా గొలుసులు), రూ.60వేల నగదు అపహరణకు గురైనట్లు రేణుక తెలిపారు. కూతురు పెళ్లి కోసం భద్రపరిచిన నగలు, నగదు చోరీకి గురి కావడంతో బాధితురాలు కన్నీరు మున్నీరుగా విలపించింది. పోలీసులు విచారణ ప్రారంభించారు.

అంతరాయం లేని విద్యుత్

- ఇంటర్ లింక్ వ్యవస్థ అనుసంధానం
- 13 సబ్‌స్టేషన్ల పరిధిలో పనులు
- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్



సబ్‌స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ వేణుమాధవ్

జనగామ: జిల్లాలోని 13 చోట్ల ఉన్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఇంటర్ లింక్ వ్యవస్థను అనుసంధానం చేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ టి. వేణుమాధవ్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వినియోగదారులకు ప్రత్యామ్నాయ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేయడానికి ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థ దోహదపడుతుందని చెప్పారు. ఇప్పటి వరకు 8 సబ్ స్టేషన్ల పరిధి 33 కేవీ లైన్లలో ఇంటర్ లింక్ వ్యవస్థను పూర్తి చేశామని, మరో ఐదు చోట్ల పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు సంస్థ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, మెయింటనెన్స్, ఇతర కారణాల చేత లైన్ లేదా సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన.. నిలిపివేసిన సమయంలో ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థ ద్వారా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే 11కేవీ ఇంటర్ లింక్ లైన్ల వ్యవస్థపై దృష్టి సారించినట్లు తెలిపారు.

వచ్చే వారమే సీటీ స్కాన్ సేవలు

- వైద్యులు సమయపాలన పాటించాలి
- డీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా



సీటీ స్కాన్ సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్



వార్డులో చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(డీహెచ్)లో నూతనంగా ఏర్పాటు చేసిన సీటీ స్కాన్ సేవలను వచ్చే వారంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకు ముందు సీటీ స్కాన్ పని తీరుకు సంబంధించి డెమోను పరిశీలించారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావుతో కలిసి జనరల్ వార్డు, ఇతర విభాగాలను సందర్శించారు. ఫిజియో థెరపీ సేవలతో పాటు బ్లడ్ బ్యాంకు నిర్వహణ, అత్యవసర సమయంలో యూనిట్‌లను అందించేందుకు ఏ మేర సామర్థ్యం కలిగి ఉందనే దానిపై ఆరా తీశారు. భోజన వడ్డింపుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. సమయానుకూలంగా భోజనం వడ్డించాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలో ఆపరేషన్లు, జనరల్ సేవలు, డాక్టర్ల పనితీరుపై రోగులతో మాట్లాడారు. సర్కారు ఆస్పత్రిని నమ్ముకుని వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి మరింత నమ్మకం కలిగించాలని కలెక్టర్ వైద్యులు, సిబ్బందికి సూచించారు. సమయ పాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్ఎంఓ లక్ష్మీనారాయణ, డాక్టర్లు అనురాధ శంకర్, పద్మ, ప్రభ తదితరులు ఉన్నారు.

ముగిసిన కేంద్ర బృందం పరిశీలన

జనగామ రూరల్: జలశక్తి అభియాన్ కింద నేషనల్ వాటర్ అవార్డులో భాగంగా క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం పర్యటన శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు కలెక్టర్ రిజ్వాన్ బాషాతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ భూగర్భజల సంరక్షణకు చేపట్టిన పనులు, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాగుందన్నారు. బతుకమ్మకుంట అభివృద్ధి కూడా భూగర్భ జలాల సంరక్షణకు చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం 'మన జిల్లా–మన నీరు' కార్యక్రమం కింద తక్కువ ఖర్చుతో కలెక్టరేట్‌లో నిర్మించిన ఇంకుడు గుంతను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సభ్యులు అశ్వరావుపల్లి ఆర్ఎస్ రిజర్వాయర్, మీదికొండ చెక్‌డ్యాం, వెల్ది గ్రామంలో బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్, ఛాగల్లులో ఆయిల్‌పామ్ సాగు, నెల్లుట్లలో ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ప్లాంటేషన్ నర్సరీ, రఘునాథపల్లిలో ఫీజో ఎలక్ట్రిక్ మీటర్, పాలకుర్తిలో ఫామ్ పాండ్స్, వాటర్ ట్యాంకు, పైపులైన్ నిర్మాణాలు, కంపోస్ట్ షెడ్డు, జనగామలోని బతుకమ్మ కుంట అభివృద్ధి పనులు పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీఆర్డీఓ వసంత తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ 'అడ్వాన్స్‌డ్' ఫలితాల్లో ప్రథమ స్థానం

జనగామ రూరల్: ఈటీవల జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఇందులో జిల్లా 100 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. 48 మంది బాలురు, 27 మంది బాలికలు మొత్తం 75 మంది పరీక్షలకు హాజరుకాగా.. అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న వెల్లడించారు. పదో తరగతి రెగ్యులర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా 3వ స్థానం సాధించడానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో చేపట్టిన విజయోస్తు, ప్రేరణ కార్యక్రమాలే కారణమన్నారు.

ఓపెన్ స్కూల్ ఓ వరం

- తెలంగాణ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి

పాలకుర్తి టౌన్: ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కారణాలతో పాఠశాల స్థాయిలోనే చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఓ వరమని ఓపెన్ స్కూల్ తెలంగాణ జాయింట్ డైరెక్టర్ ఎం.సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాలకుర్తి మండలంలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్స్ చేయించాలని, డ్రాపౌట్ లేకుండా చూడాలని చెప్పారు. అలాగే ఉల్లాస్ ప్రోగ్రాంలో భాగంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలికల ఎడ్యుకేషన్ ఆఫీసర్ సతీశ్, అడల్ట్ ఎడ్యుకేషన్ ఏపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి, టాస్ కోఆర్డినేటర్ శంకర్‌రావు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ రవి, హెచ్‌ఎంలు శోభారాణి, ఉపాధ్యాయులు ఓరుగంటి రమేష్, అశోక్, బలరాం, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రైలెక్కిన జేసీబీలు



జనగామ రైల్వేస్టేషన్‌లో ఆగిన జేసీబీలతో వెళ్తున్న గూడ్స్‌రైలు

కాజీపేట నుంచి సికింద్రాబాద్ వైపు వందలాది జేసీబీల లోడ్‌తో వెళ్తున్న ఓ గూడ్స్ రైలు శుక్రవారం జనగామ రైల్వేస్టేషన్‌లో కాసేపు ఆగింది. పల్లెల్లో రెండు, మూడు జేసీలు పని చేస్తుంటే ఆశ్చర్యంగా చూసే ప్రజలు.. ఒకేచోట వందల సంఖ్యలో కనిపించడంతో ప్రయాణికులతో పాటు పట్టణ వాసులు వాటిని ఆసక్తిగా తిలకిస్తూ సెల్ ఫోన్లలో బంధించారు. - జనగామ

క్లుప్తంగా

టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు, సర్దుబాట్లు జరిగాయి. ఈ మేరకు చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫైనాన్స్‌ సీజీఎం వంటేరు తిరుపతి రెడ్డి డైరెక్టర్‌గా నియామకం కావడంతో ఖాళీ అయిన స్థానంలో సీజీఆర్‌ఎఫ్‌ వరంగల్‌ ఫైనాన్స్‌ మెంబర్‌గా కొనసాగుతున్న ఆర్‌.చరణ్‌దాస్‌ను పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో నియమించారు. సిరిసిల్ల సెస్‌కు ఫారిన్‌ డిప్యుటేషన్‌పై వెళ్లిన పి.విజేందర్‌ రెడ్డి అక్కడి నుంచి సెలవుపై వెళ్లి తిరిగి ఎన్పీడీసీఎల్‌లో విధుల్లో చేరాడు. ప్రస్తుతం ఆయనను మహబూబాబాద్‌ ఎస్‌ఈగా నియమించారు. సూపరింటెండెంట్‌ ఇంజనీర్‌ బి.సుదర్శన్‌ను నిర్మల్‌ నుంచి జగిత్యాలకు బదిలీ చేశారు. ఎస్‌ఈ వి.గంగాధర్‌ను మంచిర్యాల నుంచి పెద్దపల్లికి, జీఎం వి.వేణుమాదవ్‌ను కార్పొరేట్‌ ఆఫీస్‌ ప్రాజెక్టు నుంచి జీఎం ప్లానింగ్‌కు బదిలీ చేశారు. కార్పొరేట్‌ ఆఫీస్‌లో ఆపరేషన్‌ జనరల్‌ మేనేజర్‌గా కొనసాగుతున్న ఉత్తమ్‌.. మంచిర్యాల ఎస్‌ఈగా, జగిత్యాల ఎస్‌ఈ సాలియా నిర్మల్‌ ఎస్‌ఈగా బదిలీ అయ్యారు. తొర్రూరు డీఈ జి.మధుసూధన్‌ను మెట్‌పల్లికి, కార్పొరేటర్‌ ఆఫీస్‌ డీఈ జి.ఎల్‌.మల్లారెడ్డిని అదే ఆఫీస్‌లో ప్రాజెక్టు విభాగానికి, డీఈ మహబూబాద్‌ బి.పెద్దిరాజంను వరంగల్‌ డీపీఈ డీఈగా, పెద్దపల్లి ఎస్‌ఈ కార్యాలయంలో డీఈ టెక్నికల్‌ను తొర్రూరు డీఈగా, కార్పొరేట్‌ ఆఫీస్‌లో ప్రాజెక్టు డీఈ డి.నందరాథోడ్‌ను ప్రాజెక్టు నుంచి ఇంజనీరింగ్‌ డీఈగా బదిలీ చేశారు. కాపులకనపర్తి ఏడీఈ నరసింహారావును కార్పొరేట్‌ ఆఫీస్‌ ప్రాజెక్టు విభాగానికి, ఏడీఈ బి.రవిని ప్రాజెక్టు నుంచి కాపుల కనపర్తికి, ఏడీఈ బి.శ్రీనివాస్‌ యాదవ్‌ను భూపాలపల్లి క్వాలిటీ కంట్రోల్‌ నుంచి కార్పొరేట్‌ ఆఫీస్‌కు, ఏడీఈ కె.పవన్‌ కుమార్‌ను కార్పొరేట్‌ ఆఫీస్‌ నుంచి హెచ్‌టీ మీటర్స్‌ వరంగల్‌ సర్కిల్‌కు బదిలీ జరిగింది. అకౌంట్స్‌ జనరల్‌ మేనేజర్‌ ఎస్‌.దేవేందర్‌కు సీజీఆర్‌ఎఫ్‌ వరంగల్‌ ఫైనాన్స్‌ మెంబర్‌గా స్థానం చలనం కలిగింది. రెవెన్యూ జీఎం ఆర్‌.కృష్ణ మోహన్‌ను ఫైనాన్స్‌ జీఎంగా, ఆడిట్‌ జీఎం ఎస్‌.సత్యనారాయణను రెవెన్యూ జీఎంగా, ఫైనాన్స్‌ జీఎం వి.వేణు బాబును ఆడిట్‌ జీఎంగా బదిలీ చేశారు.

కూరగాయల విత్తనాల పంపిణీ



మామునూరు: ఖిలావరంగల్‌ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూల్‌ కులాల ఉప ప్రణాళిక (ఎస్‌సీఎస్‌పీ) పథకాల ఆధ్వర్యంలో శుక్రవారం వర్ధన్నపేట మండలం అంబేడ్కర్‌ నగర్‌కు చెందిన 35 మంది మహిళా రైతులకు కూరగాయల విత్తనాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్‌ రాజన్న హాజరై మాట్లాడారు. చిన్నపాటి వ్యవసాయ పనిముట్లు మహిళలకు కలిగే శ్రమను తగ్గించి పొలాల్లో కలుపు నివారణ పనులు సులభతరం చేస్తాయని తెలిపారు. కూరగాయల విత్తన కిట్లను ఇంటి ప్రాంగణంలో లేదా కంచెల వెంట నాటడం ద్వారా ఆహార భద్రత మెరుగు పడి గ్రామీణ మహిళల జీవనోపాధి స్థిరత్వానికి తోడ్పడుతుందని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్‌ సాయి కిరణ్‌, డాక్టర్‌ గణేష్‌, రైతులు పాల్గొన్నారు.

ఆషాఢం వేడుకల వేళ..

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలకు పూజలు

- అమ్మవార్లకు మొక్కుల చెల్లింపులకు సిద్ధం
- తొలిఏకాదశి నాడు బీరన్న బోనాలు ప్రత్యేకం
- గురువారం ప్రారంభమైన మాసం





హన్మకొండ కల్చరల్‌: ఆషాఢం వేడుకలకు సమయం ఆసన్నమైంది. ఉమ్మడి వరంగల్‌ జిల్లా వ్యాప్తంగా తొలకరి వానలు పలకరించాయి. ఫలితంగా పంటల సాగుతో పాటే గ్రామ దేవతల (బోనాలు)కు పూజలు మొదలు కానున్నాయి. ఆషాఢ మాసం గురువారం ప్రారంభమైంది. ఇదే సమయంలో గ్రామాల్లో అమ్మవారిని కొలిచేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. మహిళలు కలిసికట్టుగా బయలుదేరి మొక్కులు చెల్లించనున్నారు. కాగా, ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో తొలిఏకాదశి నాడు బీరన్న బోనాలు వైభవంగా నిర్వహిస్తారు. ఆషాఢ మాసంలో ప్రతీరోజు గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. కొందరికి గ్రామదేవతలకు బోనాలు సమర్పించే సంప్రదాయం కూడా ఉంది. ఇలవేల్పులైన అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తారు.

ఆలయాల్లో ఉత్సవాలు..

ఆషాఢ మాస శుద్ధ ఏకాదశి రోజున విష్ణువు యోగా నిద్రలోకి వెళ్లిన రోజుగా భావిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇదే సమయంలో పూరి జగన్నాథ రథయాత్ర, గురుపౌర్ణమిని వ్యాస పౌర్ణమిగా వేడుకగా జరుపుకోనున్నారు. అలాగే, వరంగల్‌ జిల్లాలో శ్రీభద్రకాళి అమ్మవారికి శాకంబరీ ఉత్సవాలు నిర్వహించడం ప్రత్యేకం.

గోరంటాకు మురిపెం.. ఆరోగ్యదాయకం

వర్షకాలం ప్రారంభమై బావులు, వాగులు, చెరువుల్లోకి కొత్త నీరొస్తుంది. ఇది చర్మవ్యాధులు వ్యాప్తి చెందే కాలం. వీటి బారి నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు గోరింటాకు ఔషధంగా పని చేస్తుంది. ఈ నేపథ్యంలోనే ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకును (మెహందీ) అలంకరించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఆయుర్వేద వైద్య నిపుణులు గోరింటాకు చర్మ వ్యాధుల నుంచి రక్షణ ఇస్తుందని, శరీరంలో వేడి తగ్గిస్తుందని పేర్కొంటున్నారు.

ఆరోగ్యం.. ఆనందం

హిందూ సనాతన ధర్మంలో ఆరోగ్యం, ఆనందం కోసం కొన్ని పద్ధతులు అనాదిగా వస్తున్నాయి. ఇందులో కుంకుమ, తిలకం అద్దుకోవడం, విభూదిధారణ, గంధ ధారణ, కాటుక, గోరింటాకు పెట్టుకోవడం లాంటి పద్ధతులు ఉన్నాయి. ఆయుర్వేదం ప్రకారం గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో ఉన్న వేడి తగ్గి ఆరోగ్యంగా ఉంటామని, అలాగే శరీరం కళకళలాడుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వేయిస్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు.



వనభోజనాల సందడి..

ఆషాఢ మాసంలో వనభోజనాలు ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. ప్రధానంగా గ్రామాల్లోని వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు వెల్లివిరియాలని కోరుకుంటారు. గ్రామదేవతలకు పూజలు నిర్వహించి ప్రకృతి ఒడిలో పచ్చని పంట పొలాల మధ్య చెట్ల కింద సామూహిక వనభోజన సంబురాలు జరుపుకుంటారు. పట్టణ ప్రాంతాల్లో సైతం ఈ సంప్రదాయం కొనసాగుతోంది.


గోరింటాకు వేడుకలు



గోరింటాకు చూపుతున్న మహిళలు

హసన్‌పర్తి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు వేడుకలను మహిళలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని 55వ డివిజన్‌ సత్యసాయి కాలనీలో అతివలు అరచేతిలో గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. కార్యక్రమంలో తుమ్మ వనమాల, ఎర్రబెల్లి సుజాత, చెరుకు కృష్ణవేణి, చిట్టిరెడ్డి మంగ పూల్లారి సరోజన, లావణ్య, చింత జ్యోతి, తుమ్మ ప్రియాంక, తుమ్మ పద్మ నిహాసి పాల్గొన్నారు.

వివస్త్రను చేసి.. జననాంగంలో జీడిపోసి..



వివాహితపై దాడి

- వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కారణంతోనే..
- ఘటన జరిగి ఐదు రోజులు
- తాటికాయల గ్రామంలో అమానవీయం

వరంగల్‌ క్రైం: వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధి ధర్మసాగర్‌ మండలం తాటికాయల గ్రామంలో ఐదు రోజుల క్రితం ఓ అమానవీయ ఘటన జరిగింది. ఓ వివాహితను వివస్త్ర చేసి జననాంగంలో జీడిపోసి విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడికి వివాహేతర సంబంధం కారణం కాగా, బాధిత మహిళ ఆచూకీ ఇప్పటివరకు బంధువులకు లభించలేదని సమాచారం. ఈఘటనకు సంబంధించి 'సాక్షి'కి అందిన ఎక్స్‌క్లూజివ్‌ సమాచారం మేరకు.. తాటికాయల గ్రామానికి చెందిన ఓ యువతిని పదేళ్ల క్రితం ములుగు మండలం బోలోనిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు. అతడికి సమీప బంధువైన ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ మహిళతో కలిసి సుమారు పది రోజుల క్రితం ఎటో వెళ్లిపోయారు. దీంతో సదరు వ్యక్తి భార్య తనకు జరిగిన అన్యాయాన్ని స్వగ్రామమైన తాటికాయలకు వచ్చి తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు కోపంతో రగిలిపోయి లేచిపోయిన ఆ ఇద్దరిని వెతికి ఐదు రోజుల క్రితం తాటికాయల గ్రామానికి తీసుకొచ్చి విచక్షణారహితంగా దాడి చేశారు. ఇద్దరికి గుండు గీయించారు. ఆ మహిళను ఓ మంచానికి కట్టేసి వివస్త్రను చేసి.. జననాంగంపై జీడీ (పూర్వకాలంలో నొప్పి తగ్గించేందుకు వాడేవారు, అదేవిధంగా శరీరంలోని సున్నిత అవయవాలపై పోస్తే పుండ్లు అవుతాయి) పోశారు. 'తప్పు చేశాను.. క్షమించండి' అని బాధిత మహిళ వేడుకున్నా.. పలువురు ఇష్టారీతిన దాడి చేశారు. యోనిలోంచి తీవ్ర రక్తస్రావమవుతున్నా వదల్లేదు. తర్వాత ఆఇద్దరిని ఏం చేశారో ఆచూకీ తెలియలేదు. ఈ అమానవీయ ఘటన జరిగి ఐదు రోజులు గడుస్తున్నా పోలీసులకు సమాచారం అందలేదని తెలిసింది. అసలు ఆ ఇద్దరు ప్రాణాలతో ఉన్నారో, లేదో తెలియని పరిస్థితి.

పలు రైళ్లు రద్దు, దూరం తగ్గింపు, రీషెడ్యూల్‌

కాజీపేట రూరల్‌: కాజీపేట జంక్షన్‌ సబ్‌ డివిజన్‌ పరిధిలో ఆపరేషనల్‌ రీసన్స్‌తో శుక్రవారం పలు రైళ్ల రద్దు, రీ షెడ్యూల్‌, పార్శల్లీ రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్‌ శుక్రవారం తెలిపారు.

రద్దయిన రైళ్లు

శుక్రవారం బల్లార్షా–కాజీపేట (17004) రామగిరి, కరీంనగర్‌–సిర్పూర్‌ టౌన్‌ (67772) పుష్‌పుల్‌, సిర్పూర్‌టౌన్‌– కరీంనగర్‌ (67771) పుష్‌పుల్‌లను రద్దు చేశారు.

దూరం కుదించిన రైళ్లు

భద్రాచలం–బల్లార్షా (17033) సింగరేణి, కాజీపేట–సిర్‌పూర్‌టౌన్‌ (17003) ప్యాసింజర్‌, సిర్పూర్‌టౌన్‌–భద్రాచలం (17034) సింగరేణి, హైదరబాద్‌–సిర్పూర్‌కాగజ్‌నగర్‌(17012) ఇంటర్‌సిటీ, సిర్పూర్‌ కాగజ్‌నగర్‌–బీదర్‌ (17012) ఎక్స్‌ప్రెస్‌, సికింద్రాబాద్‌–సిర్‌పూర్‌కాగజ్‌నగర్‌ (12757) ఇంటర్‌సిటీ, సిర్పూర్‌ కాగజ్‌నగర్‌–సికింద్రాబాద్‌ (12758) ఎక్స్‌ప్రెస్‌, సిర్పూర్‌ కాగజ్‌నగర్‌–సికింద్రాబాద్‌ (17234) ఎక్స్‌ప్రెస్‌, సికింద్రాబాద్‌–గుంటూర్‌ (17202) ఎక్స్‌ప్రెస్‌ను దూరం తగ్గించినట్లు తెలిపారు.

రీ షెడ్యూల్‌

సికింద్రాబాద్‌–నాగపూర్‌ (20102) ఎక్స్‌ప్రెస్‌ను 3 గంటలు రీషెడ్యూల్‌తో నడిపిస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమానికి సర్కారు కృషి

- అర్హులకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు
- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



దివ్యాంగులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషిచేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం మహాదేవపూర్‌ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలీం కో సంస్థ ద్వారా దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఇతర ఉపకరణాలు కలెక్టర్‌ రాహుల్‌శర్మతో కలిసి అందజేశారు. అనంతరం మంత్రి శ్రీధర్‌ బాబు మాట్లాడుతూ.. దివ్యాంగులు సమాజంలో అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని అభిప్రాయపడ్డారు. మండలంలో సుమారు 200 మంది దివ్యాంగులను గుర్తించగా, మొదటి విడతలో 54 మందికి వివిధ రకాలైన బ్యాటరీ ట్రై సైకిళ్లు, సాధారణ ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు, చేతి కర్రలు, స్టాండ్‌లు వారి వైకల్యాన్ని బట్టి అందిస్తున్నామన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ఇల్లు లేని దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అర్హులకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అతి త్వరలో నూతన పెన్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. నిరుపేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌, సన్న బియ్యం పంపిణీ, ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి ఒకొక్క హామీని నెరవేరుస్తున్నామని తెలిపారు. అనంతరం మహదేవ్‌పూర్‌ మండలానికి చెందిన 89 మంది లబ్ధిదారులకు సుమారు రూ.90 లక్షల విలువగల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులను పంపిణీ చేశారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.20 లక్షలతో నిర్మించిన బీఆర్‌ అంబేడ్కర్‌ చిల్డ్రన్‌ పార్క్‌ను రాష్ట్ర ట్రేడ్‌ ప్రమోషన్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ అయిత ప్రకాశ్‌ రెడ్డి, కుడా చైర్మన్‌ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్‌ కలెక్టర్‌ మయాంక్‌ సింగ్‌, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ విజయ లక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, సీడీపీఓ రాధిక, డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు రామచందర్‌రావు, నాగార్జునరావు, ఎస్సైలు పవన్‌, తమాషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ దత్తత గ్రామంలో సంబురాలు

- కొండపర్తిలో గవర్నర్‌, మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం



గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ దత్తత తీసుకున్న ములుగు జిల్లా ఎస్‌ఎస్‌ తాడ్వాయి మండలంలోని కొండపర్తిలో గ్రామస్తులు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. కొండపర్తిలో ఇప్పటికే చాలా మేరకు అభివృద్ధి పనులు చేశారు. గ్రామంలోని ఆదివాసీలను వ్యవసాయం రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అభివృద్ధి పనులతోపాటు 45 ఇళ్లు మంజూరు చేశారు. 7 వ్యవసాయ బోరుబావుల నిర్మాణంతోపాటు మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు, మిర్చి పౌడర్‌ తయారీ పనులు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన మేడారం జాతర చైర్మన్‌ అరెం లచ్చుపటేల్‌ ఆధ్వర్యంలో గ్రామస్తులు గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ, రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చుపటేల్‌ మాట్లాడుతూ మంత్రి సీతక్క సూచన మేరకు గవర్నర్‌.. కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కొండపర్తి అభివృద్ధికి కృషి చేస్తున్న గవర్నర్‌, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇర్ప సీతారాములు, కల్తి రమేశ్‌, ఇర్ప రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎన్పీడీసీఎల్‌ డైరెక్టర్లు




సీఎండీ వరుణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన డైరెక్టర్లు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయంలోని శుక్రవారం టీజీ ఎన్పీడీసీఎల్‌ డైరక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఫైనాన్స్‌ డైరెక్టర్‌గా వంటెరు తిరుపతి రెడ్డి, ఆపరేషన్స్‌ డైరెక్టర్‌గా టి.మదుసూదన్‌, ప్రాజెక్ట్స్‌ డైరెక్టర్‌గా వంగూరు మోహన్‌ రావు, హెచ్‌ఆర్‌డీ అండ్‌ ఐఆర్‌ డైరెక్టర్‌గా సి.ప్రభాకర్‌ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్‌ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించగా.. సీఎండీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. సమష్టి కృషితో కంపెనీని అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ.. సీఎండీ వరుణ్‌ రెడ్డి సారథ్యంలో కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములవుతామని, వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన డైరక్టర్లను అసోషియేషన్లు, యూనియన్ల నాయకులు, ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఇతర అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల గుండెల్లోనే పీవీ..

కళ తప్పిన వంగర గ్రామం

- నేడు పీవీ నర్సింహారావు జయంతి
- వంగరలో తుదిదశకు చేరుకున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులు



ఎల్కతుర్తి: అభివృద్ధి లేమి.. అప్పుల ఊబిలో కూనరిల్లుతున్న తరుణంలో అన్నీ తానై ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ప్రగతిబాట పట్టించారు.. నాటి ప్రధాని పీవీ నర్సింహారావు. హనుమకొండ జిల్లా భీమదేవపల్లి మండలంలోని వంగర అనే ఒక చిన్న గ్రామం నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన గొప్ప మేధావి పీవీ నర్సింహారావు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో వంగర గ్రామం ఓ వెలుగు వెలిగింది. ఆ సమయంలోనే గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. నేడు దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 104వ జయంతి.

భీమదేవరపల్లి మండలం వంగరలో 1921 జూన్‌ 28న పీవీ జన్మించారు. రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులతోపాటు ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రిగా పదవులకు వన్నెతెచ్చారు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో వంగరలో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌ మంజూరైంది. రక్షిత తాగునీటి బావి, పీవీ మోడల్‌ కాలనీ, బాలికల గురుకుల పాఠశాల, 24 గంటలు పనిచేసే ఆస్పత్రి, సబ్‌స్టేషన్‌ మంజూరయ్యాయి. ఓ వైపు దేశం, మరో వైపు కాంగ్రెస్‌ పార్టీ దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో పీవీ ప్రధానిగా ఎన్నికయ్యారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న దేశాన్ని తలెత్తుకునేలా చేయడంతోపాటు భారత ఖ్యాతిని దేశ విదేశాల్లో ఇనుమడింపజేసిన ఘనత పీవీదే. కాగా, 2004 డిసెంబర్‌ 23న పీవీ తుదిశ్వాస విడిచారు. పీవీ మరణానంతరం ఆయనను సొంతపార్టీ పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. పీవీ నర్సింహారావు ఇంటిని మ్యూజియంగా మారుస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం నెరవేర్చలేకపోయింది. పీవీ సొంతగ్రామంలో విగ్రహం ఏర్పాటు చేయకపోవడంతో చివరకు గ్రామస్తులే చందాలు వసూలు చేసుకొని విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గమనార్హం.



నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రం

నెరవేరని హామీలు..

హనుమకొండ– సిద్దిపేట రహదారిలో వంగర క్రాస్‌ నుంచి గ్రామంలోకి వెళ్లే దారిలో స్వాగత తోరణం, పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు నాలుగు లైన్ల రహదారి నిర్మించి, సెంట్రల్‌ లైటింగ్‌ తీర్చిదిద్దేందుకు అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కానీ, నేటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి వంగరలో అభివృద్ధి పనుల వేగం పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుది దశలో పీవీ విజ్ఞాన కేంద్రం పనులు

వంగర గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రెండేళ్ల క్రితమే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా అప్పటి సీఎం కేసీఆర్‌ రూ.11 కోట్లు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. పీవీ విజ్ఞాన వేదిక పార్కు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. పీవీ విజ్ఞాన వేదికలో ప్రవేశ ద్వారం, ఫుడ్‌కోర్టు, ఫొటో గ్యాలరీ, పీవీ జీవిత విశేషాలకు సంబంధించిన చిత్రాలు ఉండేలా రూపకల్పన చేశారు. దీంతోపాటు ధ్యాన మందిరం, సైన్స్‌ మ్యూజియం, అంఫీ థియేటర్‌, వాటర్‌ ఫౌంటేషన్‌, చారిత్రక శిల్పాలు, పార్క్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. పీవీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రారంభించాలని గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, అప్పటి నాయకులు పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన కొనసాగాయి. కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చాక మంత్రి పొన్నం ప్రభాకర్‌.. పీవీ విజ్ఞాన కేంద్రం నిర్మాణం పనులను వేగవంతం చేశారు. దీంతో నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

హక్కుల పరిరక్షణలో ఓంకార్‌ పాత్ర ఎనలేనిది

- మోదీ పాలన దేశానికే ప్రమాదకరం
- రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్‌

వరంగల్‌ చౌరస్తా: పౌర హక్కులు.. రాజ్యాంగ పరిరక్షణ కోసం మాజీ ఎమ్మెల్యే ఓంకార్‌ చేసిన ఉద్యమాలు, త్యాగాలు ఎనలేనివని పలువురు వక్తలు తెలిపారు. వరంగల్‌ అండర్‌ బ్రిడ్జికి సమీపంలోని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దికాయల ఓంకార్‌ శతజయంతి వార్షికోత్సవాల్లో భాగంగా పౌర హక్కుల పరిరక్షణలో ఆయన పాత్ర అంశంపై రౌండ్‌ టేబుల్‌ సమావేశాన్ని నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెదారపు రమేష్‌ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల, న్యూ డెమోక్రసీ గ్రేటర్‌ కార్యదర్శి రాచర్ల బాలరాజు, నాయకులు నున్నా అప్పరావు, లిబరేషన్‌ జిల్లా కార్యదర్శి అక్కనపెల్లి యాదగిరి, రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్‌, ప్రజా సంఘాల నాయకులు సోమ రామమూర్తి, కేడల ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీ నాయకులను అక్రమంగా జైలులో పెడుతుందని ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నాని అన్నారు. అడవిలోని ఆదివాసీలను కాల్చి చంపుతూ.. అటవీ సంపద కార్పొరేట్‌ పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు అనేక కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు నర్ర ప్రతాప్‌, కుసుంబ బాబురావు, జగదీశ్వర్‌, నలిగంటి చంద్రమౌళి, రాజన్న, అనిత, ఇస్మాయిల్‌ పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి సమన్వయంతో పనిచేయాలి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్‌: జూలై 7న నిర్వహించనున్న కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలని కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి ఆయా కమిటీల కన్వీనర్లు, మెంబర్లను కోరారు. ఇప్పటికే స్నాతకోత్సవం నిర్వహణకు ఐదుగురు ప్రొఫెసర్లతో కూడిన స్టీరింగ్‌ కమిటీ, 10 సబ్‌ కమిటీలను కేయూ రిజిస్ట్రార్‌ రామచంద్రం నియమించారు. అన్ని కమిటీల కన్వీనర్లతో శుక్రవారం క్యాంపస్‌లోని అకాడమిక్‌ కమిటీ హాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్నాతకోత్సవానికి గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ, హైదరాబాద్‌లోని ఐఐసీటీ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. స్నాతకోత్సవం స్టీరింగ్‌ కమిటీ మెంబర్‌ కన్వీనర్‌ ఆచార్య రాజేందర్‌ మాట్లాడుతూ.. ఇప్పటికే 331 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాల కోసం రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారన్నారు. 374 మంది విద్యార్థులకు 564 బంగారు పతకాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించిన విషయాలను ఆయన వివరించారు. సమావేశంలో రిజిస్ట్రార్‌ ఆచార్య రామచంద్రం, స్టీరింగ్‌ కమిటీ చైర్మన్‌ ఆచార్య మల్లారెడ్డి, యూనివర్సిటీ కాలేజీ ప్రొఫెసర్‌ మనోహర్‌, ప్రొఫెసర్‌ వెంకట్రామ్‌ రెడ్డి, ప్రొఫెసర్‌ మల్లికార్జున్‌రెడ్డి, అమరవేణి, ప్రొఫెసర్‌ నర్సింహారెడ్డి, ప్రొఫెసర్‌ శ్రీలత, ప్రొఫెసర్‌ షమిత, ప్రొఫెసర్‌వై వెంకయ్య, ప్రొఫెసర్‌ మామిడాల ఇస్తారి, డాక్టర్‌ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



కమిటీల బాధ్యులతో సమీక్షిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

ఆర్టీసీ టూర్‌ ప్యాకేజీని వినియోగించుకోవాలి

- డిప్యూటీ ఆర్‌ఎం భాను కిరణ్‌

హన్మకొండ: పర్యాటకులు ఆర్టీసీ టూర్‌ ప్యాకేజీని వినియోగించుకోవాలని ఆర్టీసీ వరంగల్‌ రీజినల్‌ డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భాను కిరణ్‌ అన్నారు. ఆర్టీసీ టూర్‌ ప్యాకేజీలో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా బస్‌ స్టేషన్‌లో బొగత జలపాతానికి బయల్దేరిన రెండు ఆర్టీసీ బస్సులను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నాగార్జునసాగర్‌, బొగత జలపాతం, శ్రీశైలం, పాండవుల గుట్టలు, కాళేశ్వరం దేవాలయం, కాళేశ్వరం ప్రాజెక్టు, వేములవాడ, కొండగట్టు, కానిపాకం, అరుణాచలం, జోగులాంబ ప్రదేశాలకు ఆర్టీసీ టూర్‌ ప్యాకేజీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్స్‌ ప్రెస్‌, డీలక్స్‌, సూపర్‌ లగ్జరీ బస్సులను ఈ టూర్‌కు సమకూరుస్తున్నామన్నారు. 30 మంది ఉంటే బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 89777 81103, 94938 82464, 95730 90136 ఫోన్‌ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్‌ భూక్యా ధరంసింగ్‌ నాయక్‌, ఉద్యోగులు, పర్యాటకులు పాల్గొన్నారు.